**మలి వయసులోనూ జీవితం నిశ్చింతగా గడపటానికి ఆర్థిక క్రమశిక్షణతో కూడిన ముందుచూపు అవసరం.**

# ముందుచూపు

లోపలకు వస్తోన్న పార్వతమ్మను చూడగానే సుగుణమ్మ మొహంలోకి ఆనందం వచ్చింది. టీవీని ఆపేస్తూ "రావమ్మా... మరీ నల్లపూసవైపోయావేం?" ఆప్యాయంగా అడిగింది.

పార్వతమ్మ లోపలకు వచ్చి ఆమె పక్క కుర్చీలో కూర్చుంటూ నిట్టూర్చింది. "ఇంటికొచ్చిన వాళ్లని చూసి నీలా టీవీ ఆపేసేవాళ్లు ఎక్కడో గానీ ఉండటం లేదు. రోజులలా మారిపోయాయి... మనుషులూ, మాటల ముచ్చటా ఎవరికీ అక్కర్లేదు. ఆమధ్య అవతలి వీధిలో ఉండే మా బంధువులింటికి... చాలానాళ్లయింది, చూసొద్దామని వెళ్లానా... టీవీవైపు నుండి చూపులు తిప్పకుండానే మొక్కుబడి పలకరింపులు. పందెంకోళ్ళు కాళ్ళు దువ్వుతున్నట్లుగా, అత్తాకోడళ్లిద్దరూ... ఒకటే మాటల ఈటెలు విసిరేసుకోవటమే... అదే, సీరియల్‌లోనే... సీను అంత రసవత్తరంగా సాగుతోంటే, పాపం వీళ్లు మాత్రం తలలెలా తిప్పగలుగుతార్లే. సీరియల్స్ వచ్చే టైములో వెళ్లటం నాదే తప్పులే అనుకుని, రెండు క్షణాలుండి లేచి చక్కా వచ్చేస్తుంటే... పెద్దావిడ 'అయ్యో... అపుడేనా...' అనేసరికి ఆగి ఏదో చెప్పబోయాను. సీరియల్‌లో లీనమైపోయిన ఆవిడ వాళ్ళతోనే అంటోందని అర్థమై, ఇక మాట్లాడకుండా వచ్చేశాను" పెద్దగా నవ్వింది.

"బావుంది" అంటూ సుగుణమ్మ నవ్వి – "ఏదో పనిలోపడి నువ్వు రావటం లేదేమోనని ఈవేళ నేనే మీ ఇంటికి వద్దామనుకుంటున్నా" అంది.

"మా కోడలు ఇన్‌స్పెక్షన్‌కని వచ్చి ఈవేళ పొద్దున్నే వెళ్లింది. ఆ హడావుడిలో తీరుబడి లేక రాలేదు" చిరునవ్వుతో చెప్పింది పార్వతమ్మ.

"ఇన్‌స్పెక్షన్ ఏమిటీ?" సుగుణమ్మ ఆశ్చర్యపడింది.

"మునుపు అద్దె సొంత ఇంట్లో స్వతంత్రంగా ఉండేవాళ్లం. ఇప్పుడే సొంత అద్దె ఇంట్లో ఏవో చిన్న చిన్న ఇబ్బందులు... అంటే... యజమానుల చెకింగ్‌లన్న మాట!" అంటూ గల గల నవ్వింది.

"అంటే?" సుగుణమ్మ మొహంలో ఆశ్చర్యం మరి కొంచెం పెరిగింది.

పార్వతమ్మ చిన్నగా మళ్ళీ నవ్వింది. "అంటే ఏం లేదు... మునుపు మేం అద్దె ఇంట్లో ఉన్నప్పుడు ఇంటిగల వాళ్లు ఎక్కడో ఉండేవాళ్లు. వాళ్ల తనిఖీలు, తాకిడీ మాకేం ఉండేది కాదు. ఏదో మాకు వీలయినట్లు చీపురుతో వూడ్చేసుకుని చెంబుతో నీళ్లు పోసి కడిగేసుకునే వాళ్లం. అంతే. ఇపుడు మా కోడలు లోన్ తీసుకుని అపార్ట్‌మెంట్ కొన్నాక ఆ అద్దె బ్యాంకుకే కట్టొచ్చని మేం అందులోకి మారాం కదా. దాంతోనే వచ్చింది తంటా అంతా! రెండు రోజులు సెలవు దొరికినప్పుడల్లా ఇంటిని, మమ్మల్ని కాదులే... చూసుకోవటానికి వస్తూంటుంది. పాలరాతి నేల, టేకు తలుపులూ మిలమిలలు లేకుండా మాసిపోతున్నాయని చిరాకు పడుతూ పనమ్మాయికి నాలుగొందలు ఎక్కువిచ్చి అయినా మూల మూలలా రుద్దించమంటుంది! ఇంటికి సౌకర్యాలూ ఎక్కువే. దాంతోపాటూ చాకిరీ ఎక్కువే! ధగధగలాడేలా రుద్దేంత సత్తువా నాకు లేదు. నిజం చెప్పాలంటే పనమ్మాయికి ఇంకా ఎక్కువిచ్చే స్తోమతూ లేదు. మనం సంపాదించి పిల్లలకివ్వగలిగితే బాగానే ఉంటుంది. వాళ్లమీద ఆధారపడితే వాళ్ల పెత్తనానికి తలవొంచాల్సిందే, ఎవరికైనా అంతే, తప్పదు!"

"మీ అబ్బాయేమంటాడూ?" సుగుణమ్మ ఆరా తీసింది.

పార్వతమ్మ నిట్టూర్చింది. "అనటానికేం ఉందీ! ఇంటి షోకులకి బోలెడంత డబ్బు పోశారు. వాళ్లావిడ మాటలు కరెక్టేగదా అనుకుంటాడు! మనమెంత కష్టపడి పెంచామో పిల్లలకేం పట్టదు. అడ్డాలనాడు బిడ్డలుగానీ గడ్డాలనాడు కాదని పెద్దలూరికే అన్నారా? అయినా అంత సమస్యేమీ లేదు. ఊళ్లో పాతదో ఏదో ఓ సొంత కొంపంటూ ఉంది కాబట్టి బతికిపోయాం. నాలుగు నెలల్లో ఆయన రిటైరవ్వగానే అక్కడికే చేరదామని అనుకుంటున్నాం. ఇక్కడ మాత్రం ఏం ఉందీ? ఎవరి గూట్లో వాళ్ళు తలుపులు బిగించుకుని కూర్చోవటమేగా. ఊళ్లో అయితే గుమ్మం ముందు కూర్చున్నా, గోడ దగ్గర నిలబడినా వదినా... పెద్దమ్మా... అంటూ చిన్నా, పెద్దా పలకరిస్తూంటారు. మనుషులకు కరువుండదు. ఈ కొత్తింటికి అద్దె కూడా కొంచెం ఎక్కువా వస్తుంది. ఆ వచ్చేవాళ్లు ఇంటిని ఎలా ఉంచుతారో... ఆ తిప్పలేవో వాళ్లే పడతారు. మాకేం బెడద ఉండదిక!"

అటూ ఇటూ తిరుగుతూ పనులు చక్కబెట్టుకుంటున్న సుగణమ్మ కోడలు రజని కాఫీ కప్పులతో వచ్చి వాళ్లిద్దరికీ అందించి తనూ ఒకటి తీసుకుని కూర్చుంది. అప్పుడప్పుడూ వాళ్లతో కలిసి కాఫీ తాగుతూ మాటలు కలపటం ఆమెకు అలవాటే.

"అత్తయ్యగారూ మిమ్మల్నో మాట అడగనా?" రజని పార్వతమ్మ వైపు చూస్తూ అడిగింది.

"దానికేం భాగ్యం... అడుగమ్మా" చిరునవ్వుతో అంది.

"మీ పిల్లల చిన్నప్పుడు మామయ్యగారి సంపాదన బాగానే సరిపోయేదా? లేక పిల్లలకి మాత్రం అన్నం పెట్టి మీరు పస్తులున్న రోజులూ ఉండేవా?" సందేహిస్తూనే మెల్లగా అడిగింది.

“అయ్యో అదేం మాట! గొప్ప సంపాదన కాకపోయినా తిండికేం లోటు లేదు. మూడుపూటలా అందరం సుష్టుగా తినేవాళ్ళం!”

“అయితే పిల్లల ఖర్చుల వల్ల మీ బట్టలన్నీ బాగా చిరిగిపోయేవరకూ కొత్తవి కొనుక్కోలేకపోవటం గానీ, ఎక్కడికైనా వెళ్లాలనుకుని వెళ్లలేక మానుకోవటం గానీ జరిగిందంటారా?” గొంతులో కొంచెం సంకోచం ఉండనే ఉంది.

“అలాంటివేం లేవు. అన్నింటికీ కాదుగానీ ముఖ్యమైన పండుగలన్నింటికీ ఖరీదైనవి కాకపోయినా మా తాహతుకు తగ్గ మంచి బట్టలే కొనుక్కునే వాళ్లం. ఇక ప్రయాణాలంటావా మా అందరికీ సరదానే. దగ్గరి బంధువులింట్లో ఏ శుభకార్యానికైనా పిల్లలందరితో ముందుగా మేమే హాజరు” అంటూ నవ్వి – “ఎందుకు రజనమ్మా, కొత్తగా ఈ వివరాలన్నీ అడుగుతున్నావు?” అంది.

“ఏం లేదూ అత్తయ్యగారూ... నా చిన్నప్పుడు మా పక్కింట్లో ఒక కుటుంబం ఉండేది. ఆయనది ఏదో చిన్న ఉద్యోగం. సంపాదన తక్కువ, పిల్లలేమో నలుగురు. ఆవిడ చాలా సన్నగా రివటలా ఉండేది. మా అమ్మని ‘ఎందుకమ్మా, ఆవిడంత సన్నగా ఉంటుందీ?’ అని ఒకసారి అడిగితే ‘ఒకరా ఇద్దరా నలుగురు పిల్లలు. వాళ్లకి సర్దిసర్ది పెడుతుందే గానీ తను ఒక పూటయినా కడుపునిండా తింటుందనుకోను... చాకిరీకి తగ్గ తిండి లేనపుడు అలాకాక ఇంకెలా ఉంటుందీ’ అంది. ఏ పండక్కీ ఆవిడ కొత్తచీర కట్టుకోగా చూళ్లేదు. ఇంటి పనంతా అయ్యాక కూడా క్షణం తీరుబడిగా కూర్చోకుండా ఏవో చేతిఖర్చులకైనా వస్తాయని అప్పడాలో, వడియాలో పెడుతూండేది. ఏ సినిమాకో పిల్లల్ని పంపిస్తుండే వాళ్లుగానీ, పెద్దవాళ్లిద్దరూ మాత్రం కదిలేవాళ్లు కాదు. అంత పొదుపుగా రోజుల్ని నెట్టుకొచ్చేవాళ్లు. పిల్లల్ని కష్టపడి పెంచటం అంటే అదేనని నేననుకునేదాన్ని. ఇపుడేమో అన్ని సౌకర్యాలు అనుభవిస్తూ పిల్లల్ని పెంచినవాళ్లు కూడా ‘పిల్లల్ని ఎంత కష్టపడి పెంచామో’ అనటం చాలాసార్లు విన్నాను. మీది ఏ రకం కష్టమో తెలుసుకుందామనిపించి... సరదాగా అడిగాను” చిరునవ్వుతోనే అంది.

“భలేదానివే” అంటూ పార్వతమ్మ నవ్వేసింది.

కోడలి మాటలకు పార్వతమ్మ ఏమనుకుంటుందోనని కొంత కంగారుపడిన సుగుణమ్మ స్థిమితపడింది. అయినా మనసులో మాత్రం అనవసర ప్రసంగమనుకుంటూ రుసరుసలాడింది.

“పిల్లల్ని పెంచటంలో అన్నీ డబ్బుతో వచ్చే సమస్యలే ఉంటాయా? ఆయాల్ని పెట్టుకునే స్థితిమంతుల సంగతి వదిలేస్తే మిగతా వాళ్లందరూ పిల్లల కోసం నిద్ర సమయాన్ని, సరదాల్ని ఇలా ఎన్నో వదులుకోవాల్సి వస్తుంది. అది మాత్రం కష్టపడటం అవదూ?” రజనీని పార్వతమ్మ అడిగింది.

“నిజమే అత్తయ్యగారూ... అయితే అవన్నీ మన పిల్లలమీద మనకుండే ప్రేమకొద్దీ, గారాబంతోనూ చేస్తాం. అంతేగానీ అందులో కష్టం ఏం ఉందీ? తల్లులందరూ చేసేవేగా, ఇక ప్రత్యేకంగా కష్టపడి పెంచాం అని కొందరు అంటూఉంటారెందుకో అనేదే నా సందేహం” రజనీ అంది.

“నువ్వు ఇద్దరు పిల్లల్ని పెంచుతున్న తల్లివే కాబట్టి నీ మాటల్ని కొట్టిపారేసే రైటు మాకు లేదు! అయితే నీకంటే వయసులో పెద్దవాళ్ళంగా, మా అనుభవాలు నీకిపుడు తెలియకపోవచ్చును.

మా వయసుకు వచ్చాక తెలుస్తాయేమో మరి గానీ అడగటానికపుడు మేం ఉండం కదా!” అంటూ పార్వతమ్మ పెద్దగా నవ్వింది.

“ఈ మాటల్ని కాదనే రైటు నాకూ లేదు మరి” అంటూ రజని కూడా నవ్వింది.

“ఇక నే వెళ్లొస్తానూ” అంటూ పార్వతమ్మ లేచి నిలబడేసరికి ఆమె వెంట సుగుణమ్మ గేటు వరకూ వెళ్లింది.

“పార్వతీ... మా కోడలు మొహమాటం లేకుండా ఏదో మాట్లాడేస్తుంటుంది. నువ్వు మనసులో పెట్టుకుని రావటం మానెయ్యకేం!” సుగుణమ్మ నసుగుతూ అంది.

“అయ్యో... అదేం మాట. పిల్లలూ వాళ్ల అభిప్రాయాల్ని, మనసులో మాటల్ని చెప్పటంలో తప్పేం ఉందీ! అలా చెబితేనే మనకూ తెలుస్తాయి. ఆలోచిస్తాం. అవునా? అయినా రజని తన ఆలోచనల్ని సౌమ్యంగానే చెబుతుంది. మా కోడలయితే పుల్ల విరిచినట్లు పెళుసుగా చెబుతుంది, ఏ విషయమైనా! వాటినే నేను పట్టించుకోను. రెండు మూడు రోజులకోసారైనా నీ దగ్గరకొచ్చి అరగంటసేపైనా అరమరికలు లేకుండా కబుర్లు చెప్పుకుంటేనే నా మనసుకు తేలిగ్గా వుంటుంది. రాకుండా నేనెలా ఉండగలను చెప్పు!” నవ్వు మొహంతో చెప్పి ముందుకు అడుగులు వేసింది.

ఇప్పటివరకూ ఏ సమస్యనైనా సరే కన్నీళ్లు పెట్టుకుంటూ చెప్పలేదు. నవ్వుతూనే చెబుతుంది పార్వతమ్మ. అలా ఎలా ఉండగలుగుతుందో మనసులోనే అనుకుంటూ సుగుణమ్మ లోపలకు వచ్చింది.

మనసులోని ఆలోచనలతో భారంగా, నిస్సత్తువగా అనిపించి వరండా మెట్లమీదే కూర్చుండిపోయింది.

కోడలు ఆ మాటలు పార్వతమ్మకి మాత్రమే చెప్పలేదు. పరోక్షంగా తనకీ చెప్పాలనే అలా మాట్లాడింది. ఆమధ్య మాటల్లో రెండు మూడుసార్లు కొడుకు అల్లరి, చదువు విషయాల్లో తను ఎంత ఆరాటపడిందో, దారిలో పెట్టడానికి ఎంత కష్టపడిందో చెప్పింది. ‘పిల్లల్ని తల్లిదండ్రులందరూ ప్రేమగా, గారాబంగానే పెంచుతారు. మీరు పెంచినట్లు మేమూ మా పిల్లల్ని అలాగే పెంచుతున్నాం కదా, ఇందులో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన కష్టం, గొప్పతనం ఏమీ లేవ’ని చెప్పుచ్చుకుని కొట్టినట్లుగా సమాధానం ఇలా చెప్పిందన్నమాట! మెత్తగా అయితేనేం దెబ్బ దెబ్బేకదా!

సుగుణమ్మకి దుఃఖం పొంగుకొచ్చింది. కళ్లల్లోకి నీళ్లు వచ్చాయి.

అపుడే లోపల నుండి బ్యాగుతో బయటకొచ్చిన రజనీ “నేనలా మార్కెట్‌కెళ్లి, ట్యూషన్ నుండి పిల్లల్ని తీసుకుని ఒక గంటలో వచ్చేస్తాను. మామయ్యగారొస్తే కాఫీ పెట్టి ఇవ్వండి” అని చెప్పి హడావుడిగా బండిమీద వెళ్లిపోయింది.

అలాగే అన్నట్లుగా తలవూపి తర్వాత కళ్లు తుడుచుకుంది.

రెండు నిమిషాల్లోనే పనిమీద బయటకెళ్లిన రాఘవరావు తిరిగి వచ్చారు. మెట్లమీద కూర్చున్న సుగుణమ్మని పరిశీలనగా చూసి “ఏం జరిగిందీ... ఎందుకలా ఉన్నావ్? మామూలు విషయమేనా?” అడిగారు.

ఈమధ్య కాలంలో కోడలి మాటలకు బాధపడటం మామూలయిందని ఆయన ఉద్దేశం.

"ఏదైనా మీకు మామూలుగానే ఉంటుంది. నా బాధ మీకర్థం కాదు" చిరాకు పడుతూ లోపలకు వెళ్లింది. తలుపులు జేరవేసి వంటగదిలోకి వెళ్లి కాఫీ కలిపి గదిలో కూర్చున్న రాఘవరావుకు అందించింది.

కాఫీకప్పు అందుకుని "ఇపుడు కూర్చుని ఏమైందో తీరిగ్గా చెప్పు" అన్నారు.

సుగుణమ్మ రుద్ధకంఠంతో మధ్యమధ్యలో కళ్లు తుడుచుకుంటూ పార్వతమ్మతో రజనీ జరిపిన సంభాషణ అంతా చెప్పుకొచ్చింది. చివరగా తన బాధనూ జోడించింది.

"ఎవరైనా పిల్లలు తల్లిదండ్రుల్ని, అత్తమామల్ని గొప్పగా, గౌరవంగా చూస్తే, అది చెప్పుకోదగ్గ విషయమవుతుంది గానీ తల్లిదండ్రులు పిల్లల్ని ప్రేమగా చూడటం సహజమేనని అందరూ అనుకునే మాటేగా... ఇదే కోడలు అంటే నువ్వు బాధపడేందుకేముందీ?"

"దీని గురించి మాత్రమే కాదు, కొన్నాళ్లుగా ఇంట్లో జరుగుతున్న సంగతుల్ని బట్టి అంటున్నాను. నాకు ఇంటి పనులు చక్కబెట్టే ఓపిక లేదు. ఇచ్చిపోవటానికి ఆస్తిపాస్తులూ మిగుల్చుకోలేదు. ఎండిన మోడు లాంటి మనుషులకి ఏ విలువా ఉండదు. ఇదంతా చేజేతులా నేను చేసుకున్నదే, మిమ్మల్నేమీ తప్పుబట్టటం లేదు" ముక్కు ఎగబీలుస్తూ అంది.

"ఇక ఆపెయ్యి. కొడలొచ్చే వేళయింది. రేపు ఆశ్రమానికి వెళ్లి నా ఫ్రెండ్ సాంబమూర్తి వాళ్లని చూసొద్దాం. రేపు వాడి పుట్టినరోజు కూడాను. ఏవైనా పళ్లు కొనుక్కుని వెళ్దాం" అన్నారు.

❊ ❊ ❊

రాఘవరావు రిటైరయ్యే సంవత్సరమే కొడుకు రవీంద్రకు ఆ ఊరికి ట్రాన్స్‌ఫరొచ్చింది. అందరూ కలిసి ఉండొచ్చని సుగుణమ్మ బ్రహ్మానందపడిపోయింది. అందరూ కలిసి కొన్నాళ్ళు బాగానే ఉన్నారు.

రవీంద్ర, అతని స్నేహితుడు చంద్రం కలిసి ఆ ఊళ్లో ఒక ఎలక్ట్రికల్ షాపు, ఎక్స్‌పోర్టు బిజినెస్ ప్రారంభించాలని ఆలోచన చేశారు. ఇద్దరూ సరిసమానంగా పెట్టుబడి పెట్టేట్లుగా నిర్ణయమైంది. అది క్లిక్ అయితే రెండేళ్ల తర్వాత కూడా రవీంద్ర కూడా ఉద్యోగం మానేసి చంద్రంతో సమానంగా పనిచేసేట్లుగా కూడా అనుకున్నారు. రజనీకి పుట్టింటివాళ్లు ఇచ్చిన పొలాన్ని అమ్మేసి, రవీంద్ర ఆదా చేసిన సొమ్ము కలిపి అన్నీ సిద్ధం చేసుకున్నాక ఒక సమస్య వచ్చింది. చంద్రానికి అనుకున్నట్లుగా పెట్టుబడికి సొమ్ము సమకూరలేదు. దాంతో అతను షాపు, బిజినెస్ నెలజీతం మీద చూస్తానని, పెట్టుబడి మాత్రం పెట్టలేనని తేల్చేశాడు.

రవీంద్ర నీరుకారిపోయాడు. పకడ్బందీగా ప్రణాళిక వేసుకుని తన వాటా డబ్బు సిద్ధం చేసుకన్నాక చంద్రం వెనక్కి తగ్గటంతో ఏం చేయాలో తోచని స్థితిలో సతమతమైపోయాడు. అప్పుడు సుగుణమ్మే ఒక ఆలోచన చేసింది.

రిటైరయినప్పుడు వచ్చిన డబ్బును రాఘవరావు బ్యాంకులో వేసి నెలనెలా వడ్డీని తీసుకుని కొంత సొంత ఖర్చులకు ఉంచుకుని మిగతాది ఇంటి ఖర్చులకి ఇస్తూంటారు. ఆ ఫిక్స్‌డ్ డిపాజిట్ డబ్బుతో పాటు పల్లెలో తమకున్న పెంకుటిల్లూ, రెండెకరాల పొలాన్నీ కూడా అమ్మేసి, అంతా కలిపి తామే సొంతంగా ఆ బిజినెస్ ప్రారంభిస్తే బావుంటుందని సుగుణమ్మ సలహా ఇచ్చింది. అందుకు రాఘవరావు అంగీకరించలేదు. ఇంకొక పార్ట్‌నర్‌ని చూసుకోవటమే మంచిదన్నారు. కీడెంచి మేలెంచినట్లుగా ఒకవేళ బిజినెస్‌లో నష్టం వచ్చినా తమ ఆస్తి అయినా మిగులుతుందని వాదించారు. సుగుణమ్మ గట్టిగా పట్టుపట్టింది. "ఎంత నష్టం వచ్చినా కొంతయినా మిగులుతుంది. ఆపైన కొడుక్కి ఉద్యోగం ఉంటుంది కద, అది చాలు" అంటూ పదిరోజులు పోరాడి భర్తను ఒప్పించింది.

రవీంద్ర బిజినెస్ చేయాలనే కోరిక తీరిందని చాలా సంతోషించాడు. ప్రతీనెలా జీతం అందుకోగానే తండ్రికి సొంత ఖర్చులకోసం కొంత ఇచ్చి మిగతా దానిలో ఇంటి ఖర్చులు జరుపుతున్నాడు. రజనీ కూడా బంధువులు నడుపుతున్న రెసిడెన్షియల్ స్కూల్‌లో టీచరుగా జాయినయింది. పార్ట్‌టైమ్ జాబ్‌గా ఉదయం క్లాసులే తీసుకునే ఏర్పాటు చేసుకుంది.

రవీంద్రా ఆఫీసు నుండి రాగానే షాపులోకి వెళ్ళి చంద్రంకు తోడుగా ఉంటున్నాడు. ఒక సంవత్సరం అలాగే కష్టపడితే, కొడుకు బిజినెస్‌లో స్థిరపడతాడనే నమ్మకం ఏర్పడి రాఘవరావుకి సంతృప్తి కలిగింది. ఆయన భయపడినట్లుగా బిజినెస్‌లో ఒడిదుడుకులు రాలేదు గానీ ఇంట్లో చిన్నచిన్న కలతలు మొదలయ్యాయి.

మనవడి కోసం సుగుణమ్మ స్వీటు ఏదో చేస్తానంటే ఆ నెలలో నాలుగుసార్లు చేయటం వల్ల కేజీన్నర నెయ్యి ఖర్చయిందని అప్పటికి వద్దనటమే కాకుండా ఇక నుండీ నెలకి అరకేజీ నెయ్యి మాత్రమే తెప్పిస్తానని ఖచ్చితంగా చెప్పేసిందట కోడలు. 'అందరం కలిసి తిరుపతి వెళ్దాము' అని ఆవిడ కొడుకును అడిగితే వచ్చే సంవత్సరం ఆలోచిద్దాం అన్నాడేగానీ మీరయినా వెళ్లిరండని అనలేదట!

ఇలాంటి ఎన్నో విషయాలకి అవమానం జరిగినట్లుగా బాధపడుతూ సుగుణమ్మ రోజూ రాఘవరావు దగ్గర తన గోడు వెళ్లబోసుకుంటుంది. రాఘవరావుకి ఏం చెప్పాలో, ఏం చేయాలో అర్థం కాకుండా ఉంది.

"చేతిలో చిల్లిగవ్వయినా లేకుండా చేసుకుని కోడలికి బాగా చులకనయిపోయాం. మన దగ్గరున్నదంతా వూడ్చి వాళ్ల చేతుల్లోనే పోశామనే సంగతి మర్చిపోయారు. బాగా మారిపోయారు. మనకేం కావాల్సినా వాళ్ల ముందు చేయి చాచాలి! దయాధర్మంగా అవునంటారు కాకపోతే కాదు పొమ్మంటారు. మనం చేయగలిగిందేం లేదు. నేనే తెలివితక్కువగా మీతో పోరాడి ఇల్లూ వాకిలీ కూడా అమ్మించేసి వాళ్ల చేతుల్లో పోయించాను. తదనంతరమైనా వాళ్లకే చెందేది ఇప్పుడే ఇస్తే బాగుపడతారని ఆశపడ్డానుగానీ నా పరిస్థితి ఇలా దిగజారిపోతుందనుకోలేదు!" ఆవిడ అలా బాధపడుతుంది.

"అలా చేసినందుకు బాధపడాల్సిన పనేంలేదు. బిజినెస్‌ని బాగానే చూసుకుంటున్నారు. బ్యాంకు లోను కడుతున్నారు. ఇంటి ఖర్చులు కొంచెం తగ్గించుకుని జాగ్రత్తగా ఉంటున్నారు. మంచి విషయమేగా! ఇంకొక్క సంవత్సరం ఇలా జరిగితే లాభాలు చేతికి వస్తాయి. చిక్కులేవీ ఉండవు. అపుడు నేను

అమ్మనంటే వీల్లేదంటూ నువ్వే గొడవ చేశావు. అంతా బాగానే ఉందని నేనిపుడు సంతోషిస్తుంటే... పొరపాటు చేశామంటూ నువ్వే సతాయిస్తున్నావు. నలుగురం కలిసి ఉన్నప్పుడు కొంచెం సర్దుబాటు మనస్తత్వం ఉంటేనే సంతోషంగా ఉండగలుగుతాం. ఆలోచించు" ఆయన ఇలా అనునయిస్తుంటాడు.

ఇది తరచుగా జరిగే కార్యక్రమమైపోయింది.

* * *

ఆ మరునాడు

రాఘవరావు, సుగుణమ్మ పళ్లు, స్వీట్సు తీసుకుని వృద్ధాశ్రమానికి వెళ్లారు. తాము తెచ్చినవి సాంబమూర్తి, శకుంతలమ్మ దంపతులకు అందించారు. కుశలప్రశ్నలయ్యాక రాఘవరావు అటూ ఇటూ పరికించి చూస్తూ "ఇక్కడ సౌకర్యాలేమంత బావున్నట్లు లేవే" అన్నారు.

సాంబమూర్తి నిట్టూరుస్తూ – "ఎవరో ధర్మాత్ములు మాలాంటి వాళ్ళ కోసం నెలకొల్పారు. ఉచితంగా ఇంత నీడనిచ్చి, తిండిపెట్టి, రోగమొస్తే మందులిస్తున్నారు. ఇంకా సౌకర్యాలు కూడానా! ఏదో రోజుల్నిలా నెట్టుకొస్తున్నాం" అన్నారు.

"ఇద్దరు పిల్లలుండీ మీరిక్కడ ఉండటమేమిటి అన్నయ్యగారూ?" సుగుణమ్మ ఆరా తీసింది.

"మా నుదుటిరాత ఇలా ఉంది ఏం చేయమంటావమ్మా" అంటూ ఆయన నిట్టూర్చారు.

"తల్లీతండ్రీ నా చిన్నప్పుడే పోయారు. బంధువుల దయాదాక్షిణ్యాలతో చదువుకుని ఉద్యోగం సంపాదించుకున్నాను. జాగ్రత్తగా ఉంటూ ఇల్లు కట్టుకోవడానికి కొంత స్థలం, పొలం కూడా కొనుక్కోగలిగాను. పిల్లలిద్దరికీ చదువులు చెప్పించాను. పెళ్ళిళ్లు చేశాం. కూతురు సుఖపడుతుందని మాకేమీ మిగుల్చుకోకుండా ఉన్న పొలం, స్థలం కట్నంగా ఇచ్చి ఆస్తిపాస్తులున్న పెద్ద ఉగ్యోగస్తుడితో పెళ్లి జరిపించాం. రిటైరయ్యాక అందిన డబ్బుతో వ్యాపారం చేసి చేతులు కాల్చుకున్నా, చివరకు బికారులుగా కొడుకు పంచన చేరాల్సి వచ్చింది"

శకుంతలమ్మ మధ్యలో అందిపుచ్చుకుంది. "పైసా చేతిలో లేని వాళ్ల పాట్లు ఎలా ఉంటాయో కొడుకు, కోడలూ మాకు చవిచూపించారు. మా కోడలికి నాది ఏ పనీ నచ్చేది కాదు. ఎందులోనూ చేయి పెట్టనివ్వదు. విదిలించేసేది. అన్నీ తనే చేసుకునేది. ఉద్యోగం చేసి వచ్చి కూడా ఇంటి పనులు చేసుకుంటూ తన భార్య కష్టపడుతోంటే నేను తీరుబడిగా కూర్చుంటున్నానని కొడుక్కీ నిష్ఠూరంగా ఉండేది. ఒకసారి నేను అసలు సంగతి చెప్పబోతే అబద్ధాలు చెబుతున్నానంటూ కోడలు రాద్ధాంతం చేసింది. మా ఆస్తిపాస్తులన్నీ కూతురికి కట్టబెట్టి, చూడాల్సిన బాధ్యతని మాత్రం కొడుకు నెత్తికెక్కించామని కోడలు ఇరుగూపొరుగూతో మాకు వినబడేట్లుగా పదేపదే చెప్పేది. పొమ్మనలేక పొగపెడుతున్న ఆ ధోరణిని భరించలేకపోయాం. కని పెంచిన కొడుకులకే మామీద కనికరం లేనప్పుడు కోడలికి ఎందుకుంటుందీ అనుకుని కూతురు దగ్గరకు చేరాం. ఎంతైనా మేం పెంచిన పిల్ల కదా, కాదనకుండా కడుపులో పెట్టుకుని చూసుకుంటుందని ఆశపడ్డాం గానీ అక్కడా చుక్కెదురైంది. మొదట మేం ఏదో మామూలుగా నాలుగు రోజులుండటానికి వచ్చామనుకుని ఆపేక్షగానే చూశారు. ఇక అక్కడే ఉండిపోవటానికి వచ్చామని తెలియగానే కూతురు, అల్లుడు ఇద్దరి తీరూ మారిపోయింది. పిల్ల

నచ్చిందని చేసుకున్నాంగానీ లేకపోతే మావాడికి ఇంకా బోలెడంత కట్నం వచ్చేదని అత్తా మామా ఇప్పటికీ సణుగుతుంటారని చెప్పి, తల్లిదండ్రుల బాధ్యత కొడుక్కి గానీ కూతురుకుండదని ఎక్కడో ఉన్న తన అత్తామామలు అన్నారని మా అమ్మాయే తేల్చేసింది. సిగ్గుతో చితికిపోయాం. ఇక ఏం చేస్తాం... ఎవరో ఈ ఆశ్రమం గురించి చెబితే అనాథల్లా వచ్చి పడ్డాం!"

సుగుణమ్మకీ చెంపల మీదుగా కన్నీళ్లు ధారలు కట్టాయి. తుడుచుకుంది.

రాఘవరావుకి బాగా ఆవేశం వచ్చేసింది. "సాంబా... ఇంత దారుణమేంటిరా! మీ పిల్లలు ఇద్దరూ ఎక్కడో ఉన్నారు కాబట్టి ఆ ప్రాంతాల్లో ఉండలేక ఇక్కడ చేరారని అనుకుంటున్నాను. ఎవరింటికైనా మనం వెళ్లినప్పుడు మర్యాదగా, ఆప్యాయంగా చూస్తే వాళ్లూ మనింటికి వచ్చినపుడు ఇంకా మర్యాదలు చేయాలని తాపత్రయపడతాం. ఎవరైనా చిన్న సాయం చేస్తే థేంక్స్ చెబుతూ కృతజ్ఞత చూపిస్తాం! అలాంటిది రక్తమాంసాల్ని పంచి, ప్రేమతో పెంచి పెద్దచేసిన తల్లిదండ్రుల పట్ల పిల్లలు ఏమాత్రం బాధ్యత లేకుండా ఇంత కఠినంగా ఉండగలరా? నమ్మలేకపోతున్నాను. అలాంటి వాళ్లని వదిలెయ్యకూడదు. నలుగురిలో నిలబెట్టి నిలదీయాలి. సాంఘిక బహిష్కరణ శిక్ష విధించాలి! ఈ పనేదో నేనే మొదలుపెడతాను. ముందుగా ఈ ఆశ్రమంలోనే ఇలాంటి పిల్లల అడ్రసు తీసుకుంటాను వాళ్లకి కౌన్సిలింగ్ ఇస్తాను".

ఆయన మాటలకు సాంబమూర్తి అడ్డం వచ్చారు. "పోనీరా... మా అదృష్టం ఇలా ఉంది, అంతే. పిల్లలు గుర్తుకొచ్చినపుడు ఇలా కన్నీళ్లు పెట్టుకుంటాం. మమ్మల్ని మేమే ఓదార్చుకుని కాసేపటికి స్థిమితపడతాం. ఒకరికొకరు తోడుగా ఇద్దరం ఉన్నాం కాబట్టి ప్రస్తుతానికి ఫర్వాలేదు, రోజులు బాగానే గడిచిపోతున్నాయిలే!"

"అవును అన్నయ్యా... మా ప్రారబ్ధం ఇలా ఉంది అంతే! ఎవర్నీ ఏమనుకునీ ప్రయోజనం లేదు. పిల్లలందరూ ఇలా ఉంటున్నారా... లేదుగా! ఎంతమంది పిల్లలు తల్లిదండ్రుల్ని నెత్తిన పెట్టుకుంటున్నట్లుగా చూసుకోవటం లేదూ? ముందు ఆలోచన లేకుండా నిరాధారంగా నిలబడటంలో మా తప్పూ ఉంది!" శకుంతలమ్మ నిట్టూరుస్తూ అంది.

ఆ మాటలకు సుగుణమ్మ ఉలిక్కిపడి తనవైపు బేలగా చూడటాన్ని రాఘవరావు గమనించి నిట్టూర్చాడు. మరికాసేపు ఏవో కబుర్లు చెప్పుకున్నాక అప్పుడప్పుడూ వస్తుంటామని వాళ్లకి చెప్పి రాఘవరావు, సుగుణమ్మ ఆశ్రమం బయటకు వచ్చారు.

దారిలోనే సుగుణమ్మ రాఘవరావును నిలదీసింది. "వాళ్ళ పరిస్థితికి నాకు కడుపులో దేవినట్లయింది. అయినా మీ మాటలు, ఆవేశం చూస్తుంటే మాత్రం ఆశ్చర్యంగా అనిపించింది. మన ఇంట్లో మాత్రం కొడుకు, కోడలి తరఫున వకాల్తా పుచ్చుకున్నట్లుగా సహనం పెంచుకోమని నాకే సలహాఇస్తారు. ఇక్కడేమో పెద్దవాళ్ల తరఫునే మాట్లాడారు?" ఆమె మాటల్లోకి కొంచెం నిష్ఠూరం వచ్చింది.

"బావుంది నీ అమాయకత్వం! రోగాన్ని బట్టి మందు ఉంటుంది గానీ అన్ని రోగాలకీ ఒకటే మందు సరిపోతుందా? అందరి పరిస్థితులూ, సమస్యలూ ఒకలా ఉండవు. వాటిని బట్టే పరిష్కార

మార్గాలూ నిర్ణయాలూ కూడా మారుతుండాలిగా! అవునా?" అదిసరే సాంబమూర్తి వాళ్లని చూశాక మన పరిస్థితి ఎంత బావుందో నీకర్థమైందిగా?"

సుగుణమ్మ తల విదిలించింది. "ఇప్పుడు నా భయం ఇంకా పెరిగింది. నిరాధారంగా ఉండటం వల్లే ఆశ్రమంలో ఉండాల్సిన పరిస్థితి వచ్చిందని శకుంతలమ్మ ఎంత చక్కగా తేల్చి చెప్పిందో చూశారుగా! పార్వతమ్మ వాళ్లకి పెన్షను వస్తుంది. ఊళ్లో ఇల్లూ ఉంది కాబట్టి కోడలి దాష్టీకానికి తలొగ్గాల్సిన అవసరం లేకుండా అక్కడకి వెళ్లిపోతున్నారు. ముందు ముందు మన పరిస్థితి ఎలా ఉంటుందో! వాళ్లు పొమ్మన్నా మనకి వేరే దారి లేదు. చూరు పట్టుకుని వేళ్లాడాల్సిందే!" గొంతు బొంగురుపోయింది. కన్నీళ్లు వచ్చేశాయి.

ఆయన తల పట్టుకున్నారు.

* * *

రోజులు గడుస్తున్నాయి. రాఘవరావు ఎదురుచూస్తున్న మార్పు మాత్రం రాలేదు. పైగా చికాకులు ఇంకా ఎక్కువవుతున్నట్లుగా అనిపించింది. సుగుణమ్మలోని మౌనరోదన గమనించిన ఆయన కొంచెం సీరియస్‌గానే ఆలోచించారు.

మునుపు తామిద్దరే ఉండటంతో ఇంటి వ్యవహారాలన్నీ సుగుణమ్మే చూసుకునేది. అది ఆమెకు బాగా సంతృప్తి కలిగించే విషయం. కొడుకు కుటుంబంతో కలిసి ఉండాల్సి రావడంతో ఆ విషయంలో కొంచెంగా మార్పు వచ్చింది. ఇంటి ఖర్చుల్ని తామూ కొంచెం భరిస్తున్నప్పుడు ఆమె బాగానే ఉంది. కొడుకే ఇంటి ఖర్చుల్ని పెట్టుకుంటూ, తమకీ కొంత ఇస్తున్నప్పటి నుండీ ఆమెలో దిగులు, భయం ఏర్పడ్డాయి. ఆర్థికభద్రత లేదనే భావమే ముఖ్య కారణమనిపించింది.

ఆరోజు... పిల్లలు స్కూలుకి, కొడుకు, కోడలు ఉద్యోగాలకి వెళ్లిపోయాక తీరుబడిగా ఉన్న సుగుణమ్మ మెల్లగా సణుక్కుంటోంది. "కొడుకు రాజ్యం పరాయిరాజ్యమని పెద్దలు ఊరికే అన్నారా. అనుభవం మీదే చెప్పారు. వాళ్లేం చెప్పినా వినాలి. వాళ్ళు పెట్టే ముద్ద తిని ఓ మూల కూర్చోవాలిగానీ ఏం మాట్లాడకూడదు. చేసుకున్న వాళ్లకి చేసుకున్నంత... ముందుచూపు లేనందుకు అనుభవించక తప్పుతుందా!"

కోడలి మాటల గురించేనని రాఘవరావుకి అర్థమైంది. వివరం అడగటం అనవసరమనిపించింది.

''నువ్వలా బాధపడాల్సిన అవసరం లేదు. మనకీ ఊళ్ళో ఇల్లూ, పొలమూ ఉన్నాయనుకో, ఇప్పుడు ఏం చేస్తావో చెప్పు" అని అడిగారు.

"ఏం చేస్తాం... ఎవరి పెత్తనానికీ తలవంచాల్సిన పని లేకుండా ఊరెళ్లిపోయి స్వతంత్రంగా బ్రతుకుతాం! అయినా మూసుకుపోయిన దారి గురించి మాటలెందుకూ అనవసరంగా?" నిట్టూర్చింది.

"అన్ని దారులూ ఎప్పుడూ మూసుకుపోవు. ఏదో మార్గం ఉండనే ఉంటుంది. ఆ విషయం నాకొదిలి ఊరెళ్లటం నీకు ఇష్టమో కాదో బాగా ఆలోచించుకుని చెప్పు" అడిగారు.

సుగుణమ్మ మొహంలోకి వెలుగొచ్చింది. ఇష్టమేనని చెప్పింది. అంతలోనే నిరాశగా నిట్టూర్చింది.

'ముందూ వెనకా పెరడున్న మంచి పెంకుటిల్లు అమ్మేశాం. అసలా ఊళ్లో అమ్మే వాళ్ళు ఉండరు. కొందామన్నా మంచి ఇళ్లు దొరకవు. కొడుకు బిజినెస్‌లో ఇపుడిపుడే కుదురుకుంటున్నాడు. కొనటానికి ఇల్లు దొరికినా ఆర్థిక పరిస్థితి అంగీకరించదు' ఆలోచిస్తూ సుగుణమ్మ నిరాశపడింది.

ఆరోజు సాయంకాలం... రాఘవరావు రవీంద్రను వెంటపెట్టుకుని బయటకు వెళ్లారు. పార్కులో కాసేపు కూర్చుందామని ఆయన అంటే, ఏదో చెప్పాలనుకుంటున్నారని రవీంద్రకు అర్థమైంది.

కూర్చున్నాక ఏ ఉపోద్ఘాతమూ లేకుండా ఆయన విషయంలోకి వచ్చేశారు. "మీ అమ్మా, నేనూ ఊరెళ్లి రెండెకరాల పొలాన్ని సొంతంగా చేసుకుంటూ అక్కడే ఉందామని అనుకుంటున్నాను. వారం రోజుల్లో ఇంటిని బాగు చేయిస్తాను".

రవీంద్ర మొహం చిన్నబోయింది. "ఇలాంటి నిర్ణయం ఎందుకు తీసుకున్నారు నాన్నా. అమ్మలా మీరూ నా సంపాదన మీది కాదనుకుంటున్నారా?" అతని మాటల్లో ఆవేదన ధ్వనించింది.

అతని చేతని తన చేతిలోకి తీసుకుని అనునయంగా రాఘవరావు చెప్పారు. "మనందరి మధ్యా అనుబంధం ఇంకా పచ్చగానే ఉంది. దీన్ని అలాగే కాపాడుకోవాలంటే దగ్గరగా ఉండి దూరమైపోయేకంటే దూరమై దగ్గరవ్వటమే మంచిదనిపించింది".

"అంటే ఏమిటి నాన్నా?"

"ఇప్పుడు ఇంట్లో ఆడవాళ్ల మధ్య ఉన్న అపోహలు, మనస్పర్థలూ, వాగ్యుద్ధాలుగా మారక ముందే మేం ఊరెళ్లి విడిగా ఉండటం బావుంటుందని బాగా ఆలోచించే నిర్ణయించుకున్నాను. మీ అమ్మకి ఉమ్మడి కుటుంబం అంటే ఇష్టమేగానీ దానికి అవసరమైన సర్దుబాటు మనస్తత్వం లేదు. ఆధిపత్యం కావాలి. పిల్లలు ఎదిగి వాళ్లకీ కుటుంబాలు ఏర్పడ్డాక పెద్దవాళ్లు వాళ్ల బాగోగులు గమనిస్తూ సలహాలు మాత్రమే ఇవ్వాలి. వయసుతోపాటు స్వయం నిర్ణయాధికారం వాళ్లకీ వచ్చేస్తుందని పెద్దవాళ్లూ తెలుసుకుంటే సమస్య ఉండదు. కోడలికి ఇంటి నిర్వహణలో వచ్చిన ఈ అధికారాన్ని మీ అమ్మ అంగీకరించలేకపోతోంది. దీంతోనే ఆడవాళ్ళ మధ్య సమస్యలూ, చికాకులూను! ఊళ్ళో ఉన్న ఇల్లూ, పొలమూ అమ్మలేదనే విషయం మీ అమ్మకి ఇపుడు చెబుతాను. మీ వల్ల తప్పేదో జరిగినట్లుగా బాధపడతావేమోనని వివరంగా చెప్పాను"

ఆయన మాటలకు రవీంద్ర మొహం కొంచెం తేటపడింది. "సరే... మీ ఇష్టం నాన్నా" అన్నాడు.

ఇంటికొచ్చాక రాఘవరావు చెప్పిన విషయం విని సుగుణమ్మ నిర్ఘాంతపోయింది. ఇల్లూ, పొలమూ బేరం పెట్టి ఊరుకు నాలుగైదుసార్లు తిరుగుతున్న సమయంలోనే రాఘవరావుకి అనుకోని విధంగా కొంత డబ్బు అందింది. ఆయనకు ఇన్సూరెన్స్ విషయంగా అందిన డబ్బును స్నేహితుడు సుందర్రావుకి అప్పుగా ఇచ్చాడు. అతను ఆర్థికంగా చిక్కుల్లో పడటంతో ఆ డబ్బుపై రాఘవరావు ఆశ వదిలేసుకున్నాడు. కొంచెం కొంచెంగా మళ్లీ పుంజుకున్న సుందర్రావు అయిదేళ్ల తర్వాత వడ్డీతో సహా

రాఘవరావుకి ఆ డబ్బు అందజేశాడు. దానినే కొడుకు వ్యాపారం కోసం ఇచ్చిన సంగతి సుగుణమ్మకి అపుడే చెప్పాల్సిన అవసరం లేదనిపించి ఆయన మిన్నకుండిపోయారు. అమ్మేశారనే ఆమె అనుకుంది.

ఈ విషయం తెలియగానే ఆశ్చర్యం, తర్వాత నిష్ఠూరం, ఆపైన ఆనందం ఆమెని ముంచెత్తాయి.

"మీకింత ముందుచూపు ఉందని నేను తెలుసుకోలేకపోయా సుమీ!" సుగుణమ్మ విస్మయంగా అంది.

'నేను మాత్రం ఇన్నేళ్ల కాపురంలో నీ గురించి కొంచెం బాగానే తెలుసుకోగలిగాను' ఆయన మనసులోనే అనుకుంటూ నవ్వుకున్నారు.

వారం రోజుల్లోనే ప్రయాణం నిర్ణయమైంది. సుగుణమ్మ చకచకా సామాన్లు సర్దేసింది. వెళ్లే రోజున సుగుణమ్మ కళ్లనీళ్లు పెట్టుకుంది. కోడలి చేతులు పట్టుకుని "రజనీ... మేం ఏమంత దూరం వెళ్లిపోవడం లేదు. నాలుగైదు గంటల ప్రయాణం అంతేగా! మేం ఎలాగూ వస్తూపోతూనే ఉంటాం. మీరు కూడా ఉద్యోగాలూ, బిజినెస్ పనుల్లోనే పూర్తిగా మునిగిపోకుండా తీరుబడి చేసుకుని నాలుగు నెలలకోసారైనా వచ్చి రెండు రోజులుండి వెళ్తుంటే అందరికీ బావుంటుంది. పిల్లల్ని సెలవలుకి పంపిస్తుండాలి సుమా! పల్లెటూరు సరదాలు వాళ్లకీ తెలుస్తాయి" ఆప్యాయంగా అంది.

కోడలు కూడా అభిమానంగా చూస్తూ – 'అలాగే' అన్నట్లుగా తలవూపింది.

వాళ్లిద్దర్నీ అలా చూస్తున్న తండ్రీకొడుకుల పెదవులపైకి చిరునవ్వులు చేరాయి.

* * *

**'ఆంధ్రభూమి వీక్లీ' 12-9-2013**